# ఇది ఇక్కడి న్యాయం!

ఉదయం పదిగంటలయింది.

రంగయ్య భూమి తనఖా బ్యాంకు చేరుకున్నాడు. అప్పటికింకా ఉద్యోగులెవ్వరూ రాలేదు.

బుజాన వున్నటవలుతో మెట్ల మీద ధూళి దులిపి కూర్చున్నాడు.... తాపీగా బీడి అంటించుకొని, జేబులోంచి చిల్లర డబ్బులు తీసి ఎంచటం మొదలుపెట్టాడు-

ఒకటి....

రెండు....

మూడు....

నాలుగు....

అయిదు....

అయిదున్నర ...

సరిగ్గా అయిదున్నర రూపాయలు వున్నాయి. భోజనానికీ, బస్సు చార్జీకి, సరిగ్గా సరిపోతుంది.

అప్పటికి నాలుగు రోజులయింది రంగయ్య పట్నమొచ్చి అప్పుజేసి తెచ్చిన ముప్పయి రూపాయల్లో అయిదున్నర తప్ప అంతా అయిపోయింది.

భూమి తనఖా బ్యాంకులో అప్పుకోసం ధరఖాస్తు పెట్టి సంవత్సర మయింది. ఇదిగో అదిగో అంటూ గడిపేస్తున్నారు. అయినా పాపం! సహనం కోల్పోలేదు రంగయ్య. విసుగు చెందని విక్రమార్కుడయ్యాడు. వాళ్ళు ఎప్పుడు రమ్మంటే అప్పుడల్లా వస్తూనే వున్నాడు. సూపర్వైజరుకు, ప్యూన్లకు పాతికో పరకో సమర్పించుకుంటూనే వున్నాడు. వచ్చినప్పుడల్లా వాళ్ళు ఇంకో వారానికి రమ్మంటూ వాయిదా వేస్తూనేవున్నారు.

సంవత్సరం క్రిందట రంగయ్య శరీరంలో హుశారు, మనసులో సంతోషం వుండేవి. అప్పుకోసం ధరఖాస్తు పెట్టుకున్న అనంతరం అవి మాయమవుతూ వచ్చాయి.... ఇప్పుడు రంగయ్య శరీరంలో నీరసం, మనుసు నిండా దిగుళ్ళు. తెల్లారుతున్నట్టే అప్పులవాళ్ళు కళ్లోకి రావడం మామూలయింది.

అప్పుకోసం ధరఖాస్తు పెట్టకమునుపు చాలాసార్లు చెప్పాడు తన భార్య సూరమ్మకి— "తనఖా బ్యాంకులో అప్పుచేసేదంటే ఊరికే వుండే పానానికి వురిపెట్టుకున్నట్టే" అని

విన్నది కాదు సూరమ్మ.... "ఆరాడ్డోళ్ళు కొంట్రాలేదా, ఎగవగేరి కొంటోళ్ళు కొంట్రా లేదా బ్యాంకీలో అప్పులు? ఈపొద్దు ఆళ్ళ బాయిలకి యింజిన్లున్నాయ్. పంట్లుపండిత్తన్నారు." అంటూ చెవులో జోరిగై పాడింది.

"ఆళ్ళంత గొప్పోళ్ళే....మనకెవురింటారు. బ్యాంకీలో మాట?" అని ఎంతో నచ్చచెప్పి చూశాడు.

ఊహుఁ-విన్లేదు. పైగా— "నీకి శాతగాక అట్లడ్డంజెప్తావ్. మనమూ బ్యాంకులో అప్పుదెచ్చుకొని వున్న, అయిదెకరాల పలానికి బాయి తొగించు కొని యింజినేయిస్తె బాగా సు క ం గా బతకొచ్చు అనుకుంటి........

నా కర్మ గాకుంటే ఇట్టా శాతగాని మొగుడు దొరకాల్లా నాకి?... మొన్న, మొన్న ఊర్లో ఎద్దులకి సబ్సిడి ఇత్తా న్నారంటే సెవులో ఏసుగోకపోతివి.... మనకి ఆ బడెద్దులే గతి.... అంతా నాకర్మ నిన్నని ఏమ్మొటగట్టు గోనేది." అంటూ సాధించింది సూరమ్మ.

చివరకి సూరమ్మ పోరు పడలేక బ్యాంకిలో అప్పుకోసం ధరఖాస్తు పెట్టాడు రంగయ్య.

రంగయ్య నిరుత్సాహపడి ఎక్కడ వెనకంజవేస్తాడోనని ధైర్యం నూరిపోస్తూనే వుంది సంవత్సరంనించి.

బ్యాంకు ప్యూను ఆఫీసు తలుపుల్ని తీస్తుంటే ఆలోచనల్లోంచి తేరుకొని చూశాడు.

సూపర్వేజరు వెంకటరత్నం కూడా వస్తున్నడేమోనని లేచి బయట కొచ్చాడు. కొద్ది దూరంలో వెంకటరత్నంతోపాటు మరో ఇద్దరు సూపర్వేజర్లు వస్తున్నారు.

రంగయ్యనుచూసి పళ్ళికిలించాడు వెంకటరత్నం. ఆ నవ్వంటే రంగయ్యకు మంట. అది విషపునవ్వని రంగయ్య అభిప్రాయం.

"రా, రా! గుండు నాకొడుకా!" అని గొణుకున్నాడు.

వెంకటరత్నానికి రైతుల్నించి వచ్చే ఆదాయాలు ఎక్కువయితే చాలు....అప్పుడే తిరుపతికెళ్ళి శుభ్రంగా గుండు చేయిస్తాడు. ఆరునెలల్లో రెండుసార్లు తిరుపతికెళ్ళిన సమయాలు కూడా వున్నాయి.

వెంకటరత్నం రంగయ్యని సమీపిస్తూనే—

"ఏం నంగయ్యా! టిపిన్ చేశావా?" అంటూ పలుకరించాడు,

"లేస్సార్!"

"ఏమండి? మాకేం కాఫీ మర్యాదలు లేవా?" వెంకటరత్నాన్ని డిమాండు చేశారు ఇద్దరు సూపర్వైజర్లు.

"కాఫీ చాలా? కాఫీ ఏం ఖర్మ టిఫిన్ కూడా యిప్పిస్తాడు. మన రంగయ్య.... ఏం రంగయ్య ఏమంటావ్?"

"........తలవూపాడు రంగయ్య."

బలి పీఠానికి నడుస్తు గొర్రె పిల్లలా వాళ్ళ వెంట నడిచాడు రంగయ్య.

హోటల్నించి బయటపడ్డారు.

రంగయ్య జేబు ఖాళీ అయింది. అందరూ నేరుగా బ్యాంకు చేరుకున్నారు.

రంగయ్య మళ్ళీ మెట్లనాశ్రయించాడు.

తనఖా బ్యాంకు రాను రాను రద్దీ ఎక్కువయింది. తన బోటీ రైతులు మెట్ల మీద కొందరు, నిలబడి కొందరు మాట్లాడుతున్నారు. ఒకరిద్దరి వద్ద బ్యాంకు ప్యూన్లు తమ "మామూల్లు" కొసరుతున్నారు. రంగయ్య వద్దకు ఆ ప్యూన్లు రావడంలేదు, ఆ డబ్బు కొసరడాలు మూడు రోజుల క్రితమే అయిపోవడం చేత.

రంగయ్య ఇవేమి పట్టించుకోవడం లేదు. ఆ నాలుగు రోజులుగా ఇంటివద్ద పరిస్థితి ఎలా వుందోనని ఆందోళన పడుతున్నాడు.... "ఈ పొద్దయినా దుడ్లిస్తారో యీరో.... యీకపోతే బోజినానికి, బస్సు చారిజీకి ఎట్లు? అని సతమవుతున్నాడు.

"ఏరా రంగా! ఈడుండావ్?" అన్న పలకరింపుతో తలెత్తి చూశాడు.

ఆ పలకరించినాయన రంగయ్య ఊరి మునసబు.

తెల్లటి గ్లాస్కో పంచె, నీలం చారల చారల చొక్కా వేసుకున్నాడు రంగయ్య కంటే సుమారు పదేళ్లు చిన్న వాడుగా కనిపిస్తాడు. గుబ్బ మీసాలు అతని దృఢమయిన దేహానికి గంభీరాన్ని, హుందాని ఇచ్చాయి. ఉన్నత కులంలోని అహంకారం అతని మాటల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

రంగయ్య టక్కున లేచి—

"అప్పుకోసర మొస్తిని రెడ్డి!" అన్నాడు.

"ఇంకా యియ్యేలా? సమ్మచ్చర మయితాంది గదరా!.... నేనూ అప్పు కోసరమే వస్తిని."

"నీ కెందుకు రెడ్డీ అప్పు? పది మందికి అప్పిచ్చే స్తోమతుండీ...."

"వచ్చే అప్పుని ఎందుకిడిసి పెట్టాలిరా.... వడ్డీ తక్కువ గదా!.... ఇంకొక బాయి తొగియ్యాల్లని అనుకుండా."

"ఇప్పటికే నాల్గు బాయిలున్నాయి గదా.... ఇంకొక బాయి గూడానా?"

"తూరుప్న దిక్కున మెరక సేనుకి నీళ్ళెక్కవురా! అందుకే అక్కడ బాయి తొగించాల్లని వుంది.... ఈ రోజు దుడ్లు కొండబోవల్లని వస్తిని."

"ఎన్నాళ్ళయింది రెడ్డీ! నువ్వు, దరకాత్తు బెట్టి?"

"మూన్నెళ్ళయితాంది."

"ట్రయిలు పిట్టు తొగించినావా?"

"ఎందుకూ?"

"ఎందుకేంది రెడ్డీ! అది తొగించందే దుడ్లియ్యరు గదా!"

"పెట్టేవోడు మనోడయితే ఏ బంతిలో కూకుంటే మనకేందిరా కొరత?"

"ఇదేందీ రెడ్డీ! కొత్తగా సెప్తుండావ్? నేను ట్రయిలు పిట్టు తొగించి యాడాది పొద్దయింది. ఈ పొద్దుటికి నాకు దుడ్డియ్యలా.... మరి నీకేమో...?"

"అదంతే లేరా, నీకు తెల్దు"

రంగయ్య ఆశ్చర్యం లోంచి తేరుకోక మునుపే మునసబు సి.ఎస్.ఆర్. (కో-ఆపరేటివ్ సబ్ రిజిష్ట్రార్) గదిలోకి వెళ్ళిపోయాడు.

కాసేపటికి చెక్కు తీసుకుని బయటి కొచ్చాడు, వెంట వెంకటరత్నం కూడా వున్నాడు. సెంట్రల్ బ్యాంకులో చెక్కును మారుస్తూనే తన "మామూలు" జేబులో వేసుకోటానికి.

"వచ్చిన పని అయిపోయిందిరా రంగా! చెప్పేది మరిసిపోతి.... ఈడ అప్పు దీసుకుంటావే, నీ బిడ్డ పెండ్లికి తీసుకున్న బాకీ తీర్చేది మరిసి పోవద్దు.... బాకీ అట్లే వుంటే వడ్డి పెరిగి పోతుంది. ఇప్పటికే శానా పెరిగి పోయింది."

చెప్పడం అయిపోగానే బాధ్యత తీరిపోయినట్టు సిగరెట్టు వెలిగించుకొని గబగబ అంగలేస్తూ వెళ్ళి పోయాడు. వెంకటరత్నం కొంచెం ఆగి—

"రంగయ్యా! ఇంకో రెండు నెలల దాకా నీకు డబ్బు రాదు. ఇప్పుడే సి.ఎస్.ఆర్. గారు చెప్పమన్నారు. మళ్ళీ వచ్చి విషయాలన్నీ చెపుతా." అని టక టక చెప్పేసి చేతిలోని మాంసం ముక్కను చూసి వెంటబడ్డ కుక్కలా మునసబును అనుసరించాడు, వెంకటరత్నం.

రంగయ్య కడపు రగుల్తోంది తనకు జరిగిన అన్యాయానికి.

వెంటనే స్వింగ్ డోర్స్ తోసుకుని సి.ఎస్.ఆర్. గదిలోకి వెళ్ళాడు.

వార్తా పత్రికలోంచి తలెత్తి చూశాడు సి.ఎస్.ఆర్.

"ఏం కావాలి?"

"మీరు సేత్తుండే దంతా అన్నాయం. యాడాది కిందట అప్పిలిగేసను పెట్టుకొన్న నాకింత వరకూ అప్పియ్యలా. రేపురా, మాపురా అంటూనే వుండారు. నిన్నా మొన్నా అప్పిలిగేసను పెట్టుగొన్న మా వూర్రెడ్డికి అప్పుడే అప్పిచ్చినారు.... అదీ ఆ రెడ్డి ట్రయిలు పిట్టు గూడా తొగించలా".

"ఇంకొహరి విషయాలెందుకోయ్! నీ సంగతి నువ్వు చూసుకో"

"నాకొగనాయం, ఆ రెడ్డి కొగనాయమా మీ బ్యాంకిలో? సెప్పు సార్" నిలదీసి అడిగాడు రంగయ్య.

"ఎక్కువ మాటాడావంటే నీకు అప్పివ్వడం జరగదు" చాలా నిబ్బరంగా అన్నాడు సి.ఎస్.ఆర్.

"ఎట్లియ్యరో అదీ సూస్తా!" రంగయ్య ఆ మాట అన్నాడే కాని తన పరంగా నిలిచి పోరాడరని రంగయ్యకి కచ్చితంగా తెలుసు.

ఆఫీసరు (సి.ఎస్.ఆర్.) మాట్లడ లేదు.

టేబుల్ మీదున్న బెల్ నొక్కాడు.... ప్యూన్ వచ్చాడు.

"బయటిగ్గెంటూ, ఈ వెధవని" అని ఇంగ్లీషులో ఆజ్ఞాపించేడు.

రంగయ్యని గేటు వరకూ లాక్కెళ్ళాడు ప్యూను.

"ఒరేయ్! అన్నాయం లంజి కొడకా! నా ఉసురు తగుల్తాదిరా సమ్మచ్చరం నించి మీ బ్యాంకోళ్ళకి ఐదు నూర్రూపాయలు ముండ! మోయిస్తి గదరా!".... దొంగ నా కొడుకా....

రంగయ్య తిట్ల వర్షం కురిపించ సాగాడు.

బ్యాంకు వాళ్ళు, రైతులు రంగయ్యని పిచ్చివాడిని చూస్తున్నట్టు చూస్తున్నారు.

సి.ఎస్.ఆర్. తన గది నుంచి బయటికొచ్చి—

"అలాగే వాగావంటే పోలీసులకి పట్టిస్తా రాస్కెల్!" అంటూ బెదిరించాడు.

రంగయ్య రోడ్డు మీద కెళ్ళి బ్యాంకు వేపు అసహ్యంగా చూసి కసికొద్ది "థూ!!! అంటూ వుమ్మేశాడు—

(నూతన మంత్లీ, డిసెంబరు 1978)